క్లుప్తంగా

పంచారామాలకు కోదాడ నుంచి ఆర్టీసీ బస్సులు

కోదాడఅర్బన్ : కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం పంచారామాలు, దక్కన్ పంచశైవ క్షేత్రాల దర్శనానికి కోదాడ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష బుధవారం తెలిపారు. అదేవిధంగా శబరిమలై యాత్రకు ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382833498, 7780433533లు, రిజర్వేషన్‌కు 9573953143 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత



శ్రీనివాసాచారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాసాచారి (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు నడిగూడెం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.19 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మన్నెం నిరంజన్‌రెడ్డి, వీఎల్ఎన్ చారి, కనకం అక్షపతి, నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గరిడేపల్లి : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఏపూరి పర్వతాలు కోరారు. బుధవారం మండల కేంద్రంలో బహిరంగ సభ పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప మహాసభకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారని తెలిపారు. సభకు ప్రతి గ్రామం నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చేకూరి రమేష్, పగడాల శ్రీనివాస్, సైదులు, నరసింహ, బాబు, నాగయ్య, పేతురు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. వీధులు జలమయం



మునగాలలో కురుస్తున్న వర్షానికి రోడ్డుపై పారుతున్న నీరు

మునగాల : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం రాత్రి 7గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది. ప్రస్తుతం వానాకాలం వరిపైర్లు కోతకు వచ్చాయని, ఈ సమయంలో అకాల వర్షాలు కురుస్తుండడంతో తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో మునగాలలో వీధులు జలమయం అయ్యాయి.

బాలికల ఆరోగ్య పరిరక్షణకు మంచి ఆహారమే ప్రధానం



మాట్లాడుతున్న ప్రకృతి వనం ప్రసాద్

కోదాడఅర్బన్ : బాలికల ఆరోగ్య పరిరక్షణకు మంచి ఆహారమే ప్రధానమని ప్రకృతి వనం ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లోగల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆహారం, ఆరోగ్యంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే హిమోగ్లోబిన్ సమృద్ధిగా పెరుగుతుందన్నారు. నిరంతరం వ్యాయామం, క్రీడల్లో బాలికలు పాల్గొనాలని సూచించారు. బాలికలు ఎక్కువగా పల్లీలు, బెల్లం, రాగిజావా, శనగలు, జొన్నలు తీసుకోవాలని, నీరు అధికంగా తాగాలన్నారు. ఆశ్రమ పాఠశాల సంక్షేమ అధికారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 200 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదాన చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి గణపవరం గ్రామానికి చెందిన చందా వేణు, మోనాల వెంకటప్పయ్య, మేకపోతుల దుర్గయ్య- ఉమారాణి దంపతులు సహకరించినట్లు తెలిపారు. మాలధారులు వల్లోజు వెంకన్న, కుందూరు పుల్లారెడ్డి, సాంబ, సంజీవరెడ్డి, ఈదారావు పాల్గొన్నారు.

మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

- వర్షంతో నేలవాలుతున్న వరి పొలాలు
- ఇప్పటికే పలుచోట్ల తీవ్ర నష్టం
- కోదాడ డివిజన్‌లో కోతకు సిద్ధంగా దాదాపు లక్ష ఎకరాలు

కోదాడరూరల్ : గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజులుగా ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి కోదాడ మండలంలో పలుచోట్ల చేతికొచ్చే దశలో ఉన్న పంట నేలవారింది. సెప్టెంబర్, అక్టోబర్‌లో పంటలకు నీటి అవసరం ఉన్నా కురవని వర్షం తీరా పంట చేతికొచ్చే సమయంలో వచ్చి నష్టాన్ని మిగుల్చుతుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలలో పెట్టుబడి పెట్టి ఆరు కాలం కష్టపడి పంట పండించినా ప్రకృతి చేతిలో ఓడిపోవాల్సి వచ్చిందని అంటున్నారు. కోదాడ డివిజన్‌లో దాదాపుగా లక్ష 20 వేల ఎకరాల వరి సాగు చేయగా ఇప్పటికి పదిశాతం మాత్రమే కోతలు పూర్తి అయ్యాయి.



రామలక్ష్మీపురంలో నేలవాలిన వరి పంట

దిగుబడి తగ్గుతుందని ఆందోళన

ఈ వానాకాలం సీజన్‌లో పంటలకు సాగర్ నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు నిరాశలో ఉన్నారు. బోర్లు, బావులతో పాటు వారికి ఉన్న నీటి సౌకర్యంతో సాగర్ నీరు వస్తుందిలే అనే ఒక ఆశతో వరిసాగు చేశారు. సాగర్‌నీరు రాకపోయిన నాటు పెట్టిన నాటి నుంచి ప్రస్తుతం కోతకు వచ్చే వరకు పంటలకు చీడపీడలు వ్యాపించినా వేల రూపాయల పెట్టుబడులతో మందులు పిచికారీ చేసి కాపాడుకుంటూ వచ్చారు. తీరా పంట కోత దశకు వచ్చిన తర్వాత ప్రకృతి రైతుల పాలిట శత్రువై తీవ్ర ఆందోళనలకు గురి చేస్తోంది. పొలాలలపై ఈదురు గాలులు, వడగండ్ల వర్షం పడటంతో దాదాపుగా ఎకరాకు నాలుగైదు బస్తాల ధాన్యం దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు టైరు కోతమిషన్లు పొలంలోకి దిగని పరిస్థితి నెలకొంది. దీంతో కోతమిషన్‌ల ఏజెంట్లు రేట్లు పెంచుతున్నారని రైతులు అంటున్నారు.

ధాన్యం నేలపాలైంది



మంగళవారం రాత్రి వీచిన గాలికి 4 ఎకరాలలో దాదాపుగా ఎకరానికి 5 బస్తాలకు పైగా ధాన్యం నేలపాలైంది. దీంతో దిగుబడి తగ్గేలా ఉంది. పంట బాగుంది.. చేతికోస్తుందనే సమయానికి వడగండ్ల వాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కష్టపడి పండించిన ధాన్యం నేలపాలు కావడంతో బాధగా ఉంది.

– అన్నెం పాపిరెడ్డి, రైతు, రామలక్ష్మీపురం

వర్షానికి నేలకొరిగిన వరి పంట

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి కోతకొచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. దీంతో కొంతమేర ధాన్యం నేలరాలింది. పలుచోట్ల రైతులు కల్లాల్లో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి కాపాడుకున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.



చాకిరాల వద్ద నేలకొరిగిన వరి పంట

రైతన్నకు తీవ్ర నష్టం

హుజూర్‌నగర్ : ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షం అన్నదాతలను అతలాకుతలం చేస్తోంది. పట్టణ శివారులో మంగళవారం రాత్రి, బుధవారం వర్షంతో పాటు వీచిన ఈదురు గాలులకు దాదాపు రెండు వందల ఎకరాలలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకొరిగింది. దీంతో వడ్ల గింజలు నేల రాలి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



హుజూర్‌నగర్ పరిధిలో..

గంగిరెద్దుల కులస్తుల సమస్యలు పరిష్కరిస్తా

- హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

గరిడేపల్లి : నియోజకవర్గంలోని గంగిరెద్దుల కులస్తుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన హుజూర్‌నగర్ నియోజకవర్గ గంగిరెద్దుల కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంగిరెద్దుల కులస్తులకు హుజూర్‌నగర్‌లో నియోజకవర్గ స్థాయి కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ తాళ్లూరు లక్ష్మీనారాయణ, సర్పంచ్ త్రిపురం సీతారాంరెడ్డి, జోగు అరవింద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, మాశెట్టి శ్రీహరి, ముప్పారపు రామయ్య, వీరంరెడ్డి, శంభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలోని గోవిందపురం, చింతలపాలెం మండలంలోని వజినేపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ కుటుంబాల వారు హుజూర్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో యంద్రాతి బాకయ్య, అరుణ, దానమ్మ, సుందర్‌రావు, జయమ్మ, రమేష్, గోపయ్య, గణేష్, మార్క్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్ నుంచి..

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 5వ వార్డు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన 100 మంది మైనార్టీలు హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి పార్టీ కండువాలను కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఎన్నికల ఇన్‌చార్జ్ మన్సూర్ అలీ, నాయకులు వజ్రపు శేఖర్, పోకబత్తిని రాజేష్, గంట సైదులు, భిక్షం, సైదులు, బషీర్, లచ్చిరెడ్డి, రామ్‌రెడ్డి, అప్సర్, నటరాజ్, నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, సైదిరెడ్డి, నర్సింహ, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్యామ్



పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శ్యామ్

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన బీఎస్పీ మండల అధ్యక్షుడు నేలమర్రి శ్యామ్ గ్రామానికి చెందిన తన అనుచరులతో కలిసి బుధవారం కోదాడలో కాంగ్రెస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నడిగూడెం మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

రామాపురంలో కాంగ్రెస్‌లో చేరికలు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 7వ వార్డు రామాపురంనకు చెందిన 15 కుటుంబాల వారు బుధవారం పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, సందీప్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

సమష్టి నిర్ణయంతో పనిచేస్తాం

కోదాడరూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ రాష్ట్రంలో పోటీ చేయడం లేదని, ప్రస్తుతం అధిష్ఠానం ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలో తెలపని పక్షంలో సమష్టి నిర్ణయం మేరకు పనిచేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు ముత్తినేని సైదేశ్వరరావు, నంబూరి సూర్యం అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో స్థానిక పరిస్థితుల దృష్ట్యా పార్టీలోని నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి అందరి ఏకాభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకుంటామని, దానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లు నరసయ్య, గుండు నాగేశ్వరరావు, పిట్టల శోభన్‌బాబు, పల్లపు నాగేశ్వరరావు, సహదేవ్, థామస్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రకృతి వనం వ్యవస్థాపకుడు ఎంసీవీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని సహజ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ప్రతి రైతు కొద్ది మొత్తంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని, ఈ పద్ధతిలో పంటలు సాగుచేసి తమతమ కుటుంబ అవసరాలకు వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో సహజ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జ్ పోగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్, కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, సీహెచ్ నరేష్, టి.మాధురి, ఎస్.సుగంధి, రైతులు, గోపాల్‌రెడ్డి, అనిత, శశికళ, వెంకన్న, ఫైనల్ ఇయర్ వ్యవసాయ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్

రేపు సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి నామినేషన్

నేరేడుచర్ల : సీపీఎం హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి ఈనెల 10వ తేదీన నామినేషన్ వేస్తున్నందున పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు కోరారు. బుధవారం స్థానిక అరిబండి భవన్ సీపీఎం కార్యాలయంలో పట్టణ, మండల పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత 9 ఏళ్లుగా తెలంగాణలో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేశారని, కేసీఆర్ పాలనలో అభివృద్ధి శూన్యం అని ఆరోపించారు. సమావేశంలో పట్టణ, మండల పార్టీ కార్యదర్శి కోదమగుండ్ల నగేష్, సిరికొండ శ్రీను, మర్రి నాగేశ్వర్‌రావు, తిరుపతయ్య, కృష్ణవేణి, దేవయ్య, సైదులు, మీనయ్య, శ్రీధర్, సోములు, నాగ సైదులు, మధు, అప్పారావు, రాణమ్మ, వరలక్ష్మి, రాములమ్మ, జానీ, వెంకన్న, కోటయ్య తదితరులు ఉన్నారు.

అవినీతికి పాల్పడని పార్టీని ఎన్నుకోవాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్టీఐ సాధన సమితి ఇన్‌చార్జ్ మధుబాబు

మఠంపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అవినీతికి పాల్పడని పార్టీని ఎన్నుకోవాలని, అందుకు ఓటును ఆయుధంగా ఉపయోగించాలని సమాచార హక్కు సాధన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మీసాల మధుబాబు కోరారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం కార్యకర్తలతో కలిసి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. అవినీతి లేని ప్రభుత్వం ఏర్పడితే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు సమానంగా అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాయమ్మ, లక్ష్మయ్య, శాంత, నాగేశ్వరరావు, ఖాసీం, అమల, లత, నాగలక్ష్మి, వీరస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- సారా, మద్యం స్వాధీనం
- 18 మందిపై కేసులు నమోదు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్, సూర్యాపేట డీటీఎఫ్, నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 45 బీర్లు, 180 లిక్కర్ బాటిళ్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని, సారా సరఫరా చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి 18 కేసులు నమోదు చేశారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి వివరాలను వెల్లడించారు. మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన వేముల లక్ష్మమ్మ, పెదవీడుకు చెందిన మేకల నాగ సోమయ్య, మఠంపల్లికి చెందిన బానోతు దేవలా, పాలకవీడు మండలం సజ్జాపురంనకు చెందిన బాణోత్ సైదమ్మ, ధరవత్ విజయ, గరిడేపల్లి మండలం కట్టవారిగూడెంకు చెందిన రావిరాల వెంకటేశ్వర్లు సారా విక్రయిస్తుండగా పట్టుకుని వారి వద్ద నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మఠంపల్లి మడంలం బీల్యానాయక్‌తండాకు చెందిన బానోతు నాగు వద్ద 10 లీటర్ల సారాతో పాటు మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి వీరందరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు, తనిఖీలు నిర్వహించి 182 లిక్కర్ బాటిళ్లు, 45 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీటికి సంబంధించి మేళ్లచెరువు మండలం కప్పలకుంటతండాకు చెందిన లావురి వెంకటేశ్వర్లు, రామాపురంనకు చెందిన గూడె రవి, మఠంపల్లికి చెందిన బీరెల్లి అంజిరెడ్డి, మట్టపల్లికు చెందిన దేగల ఆశోక్, హుజూర్‌నగర్‌కు చెందిన సింగీతం వెంకట్రామిరెడ్డి, జానపహాడ్‌కు చెందిన నాగేశ్వరరావులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మఠంపల్లి మండలం లాలితండాకు చెందిన బాణోత్ రమేష్, కృష్ణ పొలంలో దాచి ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో సూర్యాపేట డీటీఎఫ్, నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు స్థానిక ఎక్సైజ్ ఎస్ఐలు వెంకన్న, దివ్య, జగన్‌మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడ్డ మద్యం బాటిళ్లు, నిందితులతో ఎక్సైజ్ సీఐ, అధికారులు

ఊపందుకున్న నామినేషన్ల దాఖలు

కోదాడలో నామినేషన్ వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

- బీఎస్పీ, సోషల్ జస్టిస్ పార్టీల నామినేషన్లు
- ఇండిపెండెంట్లుగా నలుగురు
- హుజూర్‌నగర్‌లో ధర్మ సమాజ్ పార్టీ, పిరమిడ్ పార్టీ అభ్యర్థుల నామినేషన్లు
- బీజేపీ అభ్యర్థి తరఫున ఒకరు..

కోదాడ : కోదాడ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న బొల్లం మల్లయ్యయాదవ్ బుధవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ సమక్షంలో తన నామినేషన్ దాఖలు చేశారు. కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, వనపర్తి లక్ష్మీనారాయణ, సుంకర అజయ్‌కుమార్, ఎంపీఎస్ శాస్త్రిలతో కలిసి ఆయన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం ఆయన కార్యకర్తలతో కలిసి అక్కడి నుంచి రంగా థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కాసోజు శంకరమ్మ, ఎంపీపీలు చింత కవిత, యాతకుల జ్యోతి, డాక్టర్ బ్రహ్మం, షేక్ నయీం, మెదర లలిత, కల్లూరి పద్మజ, ఎస్‌కే.షఫీ, ఆవుల రామారావు, గోపాలకృష్ణ, నరేష్, పండు పద్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరు నామినేషన్లు..

కోదాడ అసెంబ్లీ స్థానానికి బొల్లం మల్లయ్యయాదవ్‌తో పాటు బీఎస్పీ అభ్యర్థి పిల్లుట్ల శ్రీనివాస్ తరపున మేరె యల్లారావు, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి సంపెంగి అఖిల్, ఇండిపెండెంట్లుగా షేక్ మస్తాన్ సాహెబ్, కొల్లు లక్ష్మీనారాయణ, పచ్చిపాల రామకృష్ణ, చక్రాల లింగయ్యలు తమ నామినేషన్లను దాఖలు చేశారు.



హుజూర్‌నగర్ : ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న డీఎస్పీ అభ్యర్థి అవిరెండ్ల జ్యోతి



హుజూర్‌నగర్ : పత్రాలు అందజేస్తున్న లావణ్య



హుజూర్‌నగర్ : పత్రాలు అందజేస్తున్న శ్రీకాంత్

హుజూర్‌నగర్‌లో ముగ్గురు అభ్యర్థులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా బుధవారం ముగ్గురు తన నామినేషన్లు దాఖలు చేశారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి అవిరెండ్ల జ్యోతి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి పిల్లలమర్రి లావణ్య, బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి తరఫున ఎస్. శ్రీకాంత్‌లు నామినేషన్ల పత్రాలను ఆర్ఓ జగదీశ్‌రెడ్డికి అందజేశారు. కాగా, ఇప్పటివరకు మొత్తం ఏడుగురు అభ్యర్థుల తరఫున మొత్తం 10 నామినేషన్ సెట్లు దాఖలు అయినట్లు ఆర్ఓ తెలిపారు.

కాంగ్రెస్ 50వేల మెజార్టీతో గెలవబోతోంది

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ : కోదాడలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 50 వేల మెజార్టీ ఖాయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ సామినేని ప్రమీల, టీడీపీ కౌన్సిలర్ సామినేని నరేష్, కాపుగల్లు ఎంపీటీసీ చలసాని శ్రీలతాజగన్, పీఏసీఎస్ డైరెక్టర్ కమతం వెంకటయ్య ఆయా పార్టీలకు రాజీనామా చేసి ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము గెలిచిన 100 రోజుల్లోనే కోదాడలో వంద పడకల వైద్యశాల నిర్మాణం చేపడతామన్నారు. కోదాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనైతిక ప్రవర్తనతో ఆ పార్టీలో ఉన్న మహిళా ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారిని అవమానాల పాలు చేయడంతో సహించలేక కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కోదాడలో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారు తమపై కరపత్రాలు తీయడం సిగ్గు చేటని అన్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ మైనార్టీకి టికెట్ ఇస్తే ఆ ఎన్నికల్లో రెబల్‌గా పోటీ చేసి ఆయన ఓటమికి కారణమైన మల్లయ్యయాదవ్ ఇప్పుడు దానిని తప్పుదోవ పట్టించడానికి ఈ కరపత్రాల నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వేనేపల్లి చందర్‌రావు, ఏర్నేని బాబు, పాండురంగారావు, పందిరి నాగిరెడ్డి, ఎంపీపీలు ముప్పాని ఆశ శ్రీకాంత్‌రెడ్డి, బండ్ల ప్రశాంతి, ఎలక బిందు, చుండూరు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు కృష్ణకుమారి, పందిళ్లపల్లి పుల్లారావు, కొణతం ఉమ, బాణాల కవిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రా సుధారాణి, బాషబోయిన భాస్కర్‌రావు, వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, వరప్రసాదరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాల అమలు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని నల్లగొండ ఎంపీ, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని 227వ బూత్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.



కోదాడ : కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లతో ఎంపీ ఉత్తమ్, పద్మావతి, చందర్‌రావు



హుజూర్‌నగర్ : పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్

ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన పలు కుటుంబాల వారు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్, నాయకులు గల్లా వెంకటేశ్వర్లు, ఐల వెంకన్న, సైదా మేస్త్రీ, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి తమ్మారం సర్పంచ్

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలం తమ్మారంలో సర్పంచ్ గడ్డం అరుణ, ఆమె కుమారుడు నర్సిరెడ్డితో పాటు పలు కుటుంబాల వారు బుధవారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ వారికి మూడు రంగుల కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

కోదాడరూరల్ : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది కామిశెట్టి వెంకటేశ్వర్లు, టీపీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సాగ శ్రీను బుధవారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మట్టపల్లిలో వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు మొదలుపెట్టారు. ముందుగా విష్వక్సేనునిపూజ, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం ఆలయలో నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీ, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు నీటిపాలు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

హుజూర్‌నగర్ : ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు నీటిపాలు చేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ తెలంగాణలో సరైన డిజైన్, ఇంజనీరింగ్ పర్యవేక్షణ లేక లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ఆరోపించారు. దీనిని పరిశీలించిన కేంద్ర నిపుణులు ఈ ప్రాజెక్టును పూర్తిగా తొలగించాలని సూచించారని ఆమె గుర్తు చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాండు, యాదగిరిరావు, పల్లె వెంకటరెడ్డి, బ్రహ్మం, సైదులు, వెంకన్న, హుస్సేన్, శీలం శ్రీను, కౌన్సిలర్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు బలహీన పడితే దేశం అధోగతి

కోదాడఅర్బన్ : దేశం, రాష్ట్రంలో కమ్యూనిస్టుల ప్రభావం తగ్గడంతో అప్రజాస్వామిక పాలన కొనసాగుతుందని, నిత్యం ప్రజల గురించి ఆలోచించే కామ్రేడ్లు లేని చట్టసభలు విగ్రహాలు లేని దేవాలయాల లాంటివని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం కోదాడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ నుంచి సీపీఎం అభ్యర్థిగా అసెంబ్లీ బరిలో నిలబడిన మట్టిపెల్లి సైదులు ఈ నెల 10వ తేదీన నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం వహించినప్పుడు సభలు ఇలా ఉండేవికావన్నారు. ఈ ఎన్నికల్లో మన ఓట్లు మన వాళ్లకే వేసుకొని సీపీఎం సత్తా చాటాలన్నారు. కమ్యూనిస్టులు బలహీన పడితే దేశం అధోగతి పాలవుతుందని, అరాచకం రాజ్యమేలుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో కోదాడ అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి మట్టిపల్లి సైదులు, సీపీఎం జిల్లా, డివిజన్, మండల, పట్టణ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, నర్సింహారావు, సత్యనారాయణ, వెంకటరెడ్డి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి